# ఘరినం!

పండుగకదా అని పెందలాడే లేచాను. స్నానం గట్రా చేసి కేలండర్ దేవుణ్ణోకసారి దర్శనం చేసుకున్నాను. ఏది ఏమయినా మా ఆయన కాఫీ అలవాటు నన్ను రోజూ త్వరగా లేపుతూంటుంది. పండుగనాడుకుడా దేవుడి నివేదనకి పనికిరాని కాఫీ ముందర కాచడమేమిటూ అని వంట చేసాను. (కాఫీహోటల్ దేవుడికి నివేదనేమిటని అడగొచ్చు, కాని ఇల్లు కాఫీహోటల్ కాదుకదూ?) తరవాత కాఫీకాచి ఆయన్ని లేపాను. ఆయనకూడా ఈవేళ తొందరగా లేచి కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ సేవించారు. సెలవు అనుభవించటానికి తిరగటానికి బయలుదేరుతూ, పిండివంట లేమిచేస్తావని అడిగారు. ఆయనకి ఒక్కసారి ఆశ్చర్యం కలిగేటట్లు చెప్పకుండా నే పిండివంటలు చేద్దామని, నే చేస్తానుకదూ మీరు వెళ్ళండన్నాను.

11 న్నర గంటలకల్లా పులిహోర, పరమాన్నం, చీనాజిలేబీ తయారుచేసాను. వంట ఇదివరకే అయ్యిందికాదూ! ప్రియాగమనాన్ని నిరీక్షిస్తూ కూర్చున్నా. ఇంతట్లో ఎవరో—డ్రెస్సులో పోస్టుమేన్‌లాగా వున్నాడు—ఏవో పచ్చటి కార్డులు పట్టుకొస్తున్నాడు. ఎవరివో శుభలేఖలయుండచ్చు. ఎవరిపెళ్ళో, కట్నమెంతో, వధువెవరో, వరుడెవరో, నగలు? ఇలా ప్రశ్నపరంపర బయలుదేరింది బుర్రలో. కాస్తసేపుంటే అదే తెలుస్తుంది కదా అని ఓపికబట్టి కూర్చున్నాను. సరి వాడు రానే వచ్చాడు.

'ప్రశాంతంగారి ఇల్లు ఇదేనాండి?'

'అవున'న్నాను.

'నెంబరు 869-27-ఎ కావండీ?'

'అవును'

'ఎంతమంది వున్నారండీ మీకుటుంబంలో?'

'5 గురం.'

'పిల్లలెందరు, పెద్ద లెందరండి?'

'పెళ్ళి పిలుపైతే ఈ ప్రశ్నలన్నీ దేనికి???' ఎందుకేమిటి నా మొహం? ఎవరైనా గొప్పఇంటివారయితే టిక్కెట్లుకూడా ఇవ్వదలచుకో కూడదూ? ఎందుకైనా అడిగాడుగా చెప్పడం మంచిది.

'3 గ్గురు పిల్లలు, ఇద్దరం పెద్దవాళ్ళమూను.' అన్నీ రాసుకుంటూనే వున్నాడు.

'మీకు ఉజ్జాయింపుగా రోజుకు ఎన్నిబియ్యం ఖర్చు అవుతాయండి?'

ఇదేంప్రశ్న? పెళ్ళివారు పొదుపుకోసరం ఇవన్నీ అడిగస్తున్నారే అనుకో, కాని ఇదేం దీపబ్బుడ్డా ఇంతనూనిపోస్తే ఇన్నిరోజులు వెలుగుతుంది, ఇంతనూని పట్టుతుందని చెప్పడానికి—పైగావెళ్ళేది పెళ్ళికి—'

'2 శేర్లు పట్టచ్చు. ఒక్కొక్కప్పుడు 2¼ కుడా పడతాయి' అన్నా.

సరే రాసుకున్నాడు.

'వారింట్లో లేరుగనక మీకే ఇస్తున్నానండి ఈ కార్డులు. దీంట్లో మీపేరు అవీ వ్రాస్తున్నాయండి. ప్రశాంతంగారు చెప్పినది నిజమే అని చెక్ చెయ్యడానికి వచ్చానండి. దీంట్లో రాసున్నచోటికి వెడితే మిగతా తబ్సీళ్ళు తెలుస్తాయండి' అని ముట్టినట్లు రశీదు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఒక అరగంటలో అయనావచ్చారు. ఆకలితో వచ్చారని ముందు కాళ్ళుకడుక్కోడానికి నీళ్ళిచ్చి పిండివంటలు వడ్డించి 'బాగావున్నాయి గొప్పగా చేసావ్' వగైరా పొగడ్తలకోసరం పక్కని కూర్చున్నా.

విస్తట్లో వడ్డనని చూసేటప్పటికీ ఆయన కళలు మారాయ్.

'హానిసీదుంపతెగా! ఇన్ని వంటలెందుకే? సంసారం ఇల్లా వుణ్ణీయదలచుకోలేదూ?'

ఆశాభంగంతోపాటు కోపంకూడా వచ్చింది.

'ఏం? రోజూ చేసుకుంటామా ఏమన్నానా? ఒక్కరోజుకే ఇంత అగడ చేస్తారేమిటీ! మీ పిసినిగొట్టుతనమూ మీరూను?'

'అదికాదే' వెధవడబ్బు, డబ్బు ఖర్చైందని కాదు. ఓమూల రేషన్ ముంచుకొస్తూంటే తెలీడం లేదూ? అన్నం, పులిహోర, పరమాన్నం, చీనా జిలేబీ.!!!

'శేషం. శేషమేమిటి?' మా కర్థంతెలియక. రోషం వచ్చింట నాకు.

'ఇపుడునీకు తెలియచెప్పతూ కూర్చోడానికి టైములేదు. పులిహోరకి బియ్యాం, జిలేబీకి పంచదారా దండుగ. కానీ ఈ రేషన్‌కి పరమాన్న మెక్కడ దాపరించిందో. బియ్యం, పంచదారా రెండూ వుండాలి!' ఈపైనుంచేనా ఇలాంటివి చేస్తూవుండకు.

అంటూ ఎల్లగో భోంచేసి లేచారు. నేనూ ఇంకా యేదో అభినందిస్తారనుకుంటే ఇల్లా ఏదో రేషన్ అంటూ అర్థంతెలియని ఓమాట వంకపెట్టి ఇంత చిన్నపుచ్చారనీ విచారంతోటే ఎల్లాగో అల్లాగ భోజనం కానిచ్చాను. అయినా ఓ నిద్రతీసి 5 గంటలకల్లా 'టీపార్టీవుంది, వెళ్ళివస్తా'నంటూ బయలుదేరారు.

'వెళ్లాక జ్ఞాపకంవచ్చింది. తీర్థంకదు, ఏమేనా డబ్బులు పుచ్చుకోవలసిందే. చూస్తూనే వున్నా కనిపెట్టుకొని. ఇంకా రాలేదేం చెప్మా ఎక్కడేనా టీపార్టీ అయితే టీ పుచ్చుకొని పార్టీనివదలిపెట్టే వచ్చేవారే. ఈవేళేమిటీ ఆలస్యం? అనుకుంటూంటే వచ్చారు. మొహంకొంచెం ఎదోలా పెట్టుకున్నారు.

ఆపళంగా డబ్బుఅడిగితే విసుక్కుంటారని ఇంతట్లో ఆ శుభలేక జ్ఞాపకంవస్తే,

'ఏమండోయ్! శుభలేఖ వచ్చింది ఎక్కడ్నుంచో.'

'ఇదీ ఆ టీపార్టీలాంటిదే ఏమో' అన్నారు.

'ఏం? టీపార్టీలో ఏమయిందేమిటి?'

'మన సుబ్రహ్మణ్య అయ్యర్ లేడూ? వాడీవాళ కాఫీహోటల్ ఓపెన్‌చేసాట్ట. అంచేత ఇవాళ టీపార్టీ పెట్టించాడు. 15 మందివరకు వున్నాం. ఓ ప్లేటు వుప్మా, ఓ దోసె, ఓ కప్పు టీ ఇచ్చాడు. తరవాత లెక్చరు ప్రారంభించాడు.

'మిత్రులారా! ఇవాళ పండుగ. ఇవాళ కాఫీ హోటల్ ప్రారంభిస్తే జయప్రదంగా జరుగుతుందని ఇవాళ ఓపెన్ చేసా. కాని మనస్సుకో అనుమానం తట్టింది. ఈవాళ పండుగకదా, అంచేత అందరూ ఇంటిలో పిండివంట చేసుకుంటారుకనక ఎవడూ హోటల్‌కిరాడు. అంచేతే ఇవాళ మిత్రుల్ని కేకేస్తే రేపట్నుంచి సరీగ్గా జరుగుతుందని కేకేసేను. నామాట కాదనకుండా తొలిరోజు బిల్లు చెల్లించెయ్యండి. క్షమించండి అంటూ ఐదేసి అణాలకి బిల్లు తగిలించాడు. ఏంచేస్తాం. చెల్లించి వచ్చాం. ఇదీ అంతేలావుంది. ఏది అంటూ శుభలేఖ పుచ్చుకున్నారు, ఓ నిట్టూర్పు విడచి.

'వచ్చిందీ చాలాకాలంనుంచి వస్తుందనుకుంటూనేవున్నాం. ఇవాళటికి వచ్చింది. దీని హడావిడి ఇప్పడుకాదు, చాలాకాలంనుంచి వుంది.'

'ఎవళ్ళదో పెళ్ళయితే మీకెందుకీబాధ? పెళ్లి కాదు, పెటాకులు. రేపట్నుంచి మనిషికి పూటకి $\frac{1}{4}$ శేరు బియ్యం ఇస్తారట. అది ఈ కార్డు, ఇందాకా చెప్పానుకాదూ? రేషన్ అంటే బియ్యం కొలతప్రకారం ఇయ్యడమన్నమాట.'

ఇంకా ఎవళ్ళో స్థితిపరులఇంట్లో పెళ్ళనుకున్నాను. నేను అన్ని యక్షప్రశ్నలు వేస్తూంటే యిందుకా?.............

ఇంతకీ ఈవేళ మాకు దుర్దినం. ఏమంటారు?


మంచిరకమే

రాణిస్తుంది




అంచేతనే

జాబ్‌కో బ్రిలియన్‌టైన్

ప్రఖ్యాతిగాంచింది